క్లుప్తంగా

ప్రపంచ సువార్త సేవా మండలి ప్రతినిధిగా సువర్ణరాజు



కర్నూలు(టౌన్): కర్నూలుకు చెందిన రెవరెండ్ వి.సువర్ణరాజు ప్రపంచ సువార్త సేవా మండలి (వరల్డ్ మిషనరీ ఈవాంజలిజమ్ ఆఫ్ ఇండియా) ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆ సంస్థ ఆయనకు నియామక పత్రం అందజేసింది.

నిర్విరామంగా స్వర నీరాజనం



శ్రీనివాసులును సన్మానిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు, కళాకారులు

కర్నూలు(అర్బన్): విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్, కేఎం మ్యూజికల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా స్వర నీరాజనం కార్యక్రమం జరిగింది. కేఎం మ్యూజికల్స్ ఈవెంట్స్ వ్యవస్థాపకులు ఖాజాహుసేన్, రాక్ స్టార్స్ మ్యూజికల్స్ ఈవెంట్స్ వ్యవస్థాపకులు గుర్రాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక లలిత కళా సమితిలో జరిగిన ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో గాయనీ,గాయకులు హాజరయ్యారు. తెలుగు, హిందీ,తమిళ్,కన్నడ భాషల్లోగాయకులు తమ ప్రతిభను నిరూపించుకున్నారని ట్రస్ట్ అధినేత అనుమాండ్ల నాగరాజు తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఇన్‌చార్జ్‌గా కర్నూలు నుంచి గుర్రాల శ్రీనివాసులును నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, పద్మావతి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రలో డ్రోన్ టెక్నాలజీపై సదస్సు



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా ఇంజినీరింగ్(అటానమస్) కాలేజీలో బూట్ క్యాంపు ఆన్ డ్రోన్ టెక్నాలజీపై ఐదు రోజుల పాటు జరిగిన సదస్సులో శనివారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు పాల్గొని ప్రసంగించారు. డ్రోన్ టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ఏకీకరణ వివిధ పరిశ్రమల్లో కొత్త అవకాశాలను తెరిచిందన్నారు. డ్రోన్ మానవ రహిత వైమానిక వాహనం అని, ఆధునిక కాలంలో స్వయంప్రతిపత్తి కలిగిన డ్రోన్లు వివిధ అప్లికేషన్ ప్రాంతాలను మార్చడం ప్రారంభించాయన్నారు. వాటి ఉపయోగం అనేది నేడు అనేక రంగాల్లో విస్తరించిందన్నారు. ఈ క్యాంపు రిసోర్స్ పర్సన్లుగా ట్రిపుల్ ఐటీ ఆచార్యులు డా.కె కృష్ణనాయక్, డా.కె.వి. ఈశ్వరమూర్తి, డా. సత్యబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఈసీఈ విభాగాల తృతీయ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కర్నూలు (రూరల్) : సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పాతబస్తీ పూలబజార్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పాటు విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా పేదలపై భారం పడుతుందన్నారు. అబ్దుల్ దేశాయ్, కేవీ సుబ్బయ్య, రవి, రఫిక్, జయరాం, గిడ్డయ్య, ఖాదర్ పాల్గొన్నారు.

కొలత తప్పుతోంది!

- మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు
- వస్తువుల క్రయ, విక్రయాల్లో కిలోకు 100 నుంచి 150 గ్రాముల వరకు తరుగు
- పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లోనూ అదే తీరు
- నష్టపోతున్న వినియోగదారులు
- చోద్యం చూస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

వ్యాపారుల లాభాపేక్షతో ఎక్కడ చూసినా తూనికలు.. కొలతల్లో మోసం కనిపిస్తూనే ఉంది. చిన్న కిరాణం కొట్టు మొదలు...బంగారు దుకాణాల వరకు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నాయి. పాలనుంచి పెట్రోల్ వరకూ కొలతల్లో దగా చేస్తున్నారు. దీంతో వినియోగదారుడు నిత్యం నష్టపోతున్నా తూనికల కొలతల శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

కర్నూలు (న్యూసిటీ): నిత్యావసరాలైన కూరగాయలు, పండ్లు, గృహ నిర్మాణ సామగ్రి, పెట్రోల్, డీజిల్ తదితర అన్ని వస్తువుల విక్రయాల్లో భారీగా మోసాలు జరుగుతున్నాయి. ఒక వైపు కల్తీ.. మరో వైపు తూకాల్లో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. నగరంలో ఈపరిస్థితి ఎక్కువగా ఉంది. ఇక పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో మరింత అధికంగా మోసాలు జరుగుతున్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లతో ట్యాంపరింగ్ చేస్తున్నాయి. లీటరు పెట్రోల్ 100 నుంచి 200 మిల్లీ మీటరుల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. ఏ రోజుకారోజూ పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా, ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఫిర్యాదు రావడమో, గొడవ పడడమో జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫిల్టర్ పేపర్ ఏదీ?

నగరంలో పదుల సంఖ్యలో పెట్రోలో బంకులు ఉన్నాయి. వాటి వద్ద పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపర్‌పై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినది. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్లు నిర్ధారిస్తారు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ఎక్కడ తమ మోసం బయటపడుతుందోనని చాలా మంది పెట్రోల్ బంకుల యజమానులు ఫిల్టర్ పేపర్ టెస్ట్ చేయడం లేదు.



బండిపై నల్ల నేరేడు పండ్లను రాయితో తూకం వేస్తున్న దృశ్యం



ఎలక్ట్రానిక్ కాటాలో అవే నేరేడు పండ్లను తూకం వేయగా 250 గ్రాములకు గాను 210 గ్రాములు చూపిస్తున్న దృశ్యం



పెట్రోల్ బంకు వద్ద ఫిల్టర్ పేపర్ పరీక్ష చేయకుండా వాహనాలకు పెట్రోల్ పోస్తున్న దృశ్యం

ప్రామాణిక ముద్ర ఏదీ?

నిత్యావసరాలు ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకాల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. కిలో దగ్గర 150 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. వారపు సంతలు, మార్కెట్లు, రైతు బజారులో సైతం రాళ్లనే కొలతలుగా వినియోగిస్తున్నారు. స్వీట్ల దుకాణాల్లో వాటిపై తయారీ తేదీ ఉండాలనే నిబంధన ఉన్నా, ఎక్కడా ముద్రిస్తున్న దాఖలాలు లేవు.

గృహ నిర్మాణ సామగ్రిలో మోసాలు

గృహ నిర్మాణ సామాగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఒక్కో సిమెంట్ బస్తాపై కనీసం కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీ నిబంధనల సంగతి పక్కన పెడితే.. కొంతమంది దళారులు బస్తాలోని సిమెంట్ తీసి రీ ప్యాకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తూకం తక్కువ వచ్చింది



కర్నూలులోని సీ క్యాంప్ వద్ద బండిపై 250 గ్రాముల నేరేడు పండ్లు తీసుకున్నాను. తూకంపై అనుమానం వచ్చి వేరే షాపులో కొలత వేయగా 40 గ్రాములు తక్కువ వచ్చింది. ముద్రించిన ఇనుప రాళ్లను కాకుండా మామూలు రాయితో తూకం వేస్తున్నారు. ఈ లెక్కనా చూసుకుంటే కేజీ పండ్లు తీసుకుంటే దాదాపు 160 గ్రాముల పండ్లు తక్కువగా వస్తాయి.

– రమేష్, కల్లూరు

వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు



రెండు రోజుల క్రితం కృష్ణానగర్ ఐటీసీ వద్ద 5 కిలోల మామిడి పండ్లను తీసుకున్నాను. వేరే చోట తూకం వేయిస్తే మొత్తం మీద అరకిలో తక్కువ వచ్చింది. ఇలా ప్రతి వస్తువు తూకంలో మోసమే జరుగుతుంది. అడిగితే కరెక్టే ఉందని వ్యాపారులు చెబుతారు. తూనికల కొలతల శాఖ అధికారులు స్పందించి దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేయాలి.

– శివ, కృష్ణానగర్

ఫిర్యాదు చేస్తే చర్యలు



జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ప్రమాణాలు పాటించాలి. లేకుండా చర్యలు తప్పవు. సిబ్బంది కొరత ఉన్నా ఉన్నంతలో మేము తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే మాకు ఫిర్యాదు చేయాలి. దాడులు చేసి దుకాణాదారులపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాములు, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికల కొలతల శాఖ

స్పోర్ట్స్

ఫుట్‌బాల్ క్రీడను ఆదరించాలి

కర్నూలు (రూరల్): ఫుట్‌బాల్ క్రీడను ఆదరించాలని ఒలింపిక్ సంఘం సీఈఓ విజయకుమార్ కోరారు. నగరంలోని బి.క్యాంప్ క్రీడా మైదానంలో శనివారం ఫ్రెండ్‌షిప్ కప్ ఫుట్‌బాల్ పోటీలను వ్యాపారవేత్త వివేక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. పోటీల్లో ఐదు జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో లెక్చరర్ సుధాకర్ రాజు, స్కేటింగ్ కార్యదర్శి సునీల్,చిట్టిబాబు,వినయ్, నవాజ్,విజయ్ కుమార్, బ్రహ్మ, హర్ష పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో సత్తాచాటాలి

కర్నూలు(రూరల్): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల 11, 12 తేదీల్లో జరిగే జాతీయస్థాయి ట్రైబల్ రగ్బీ పోటీల్లో సత్తాచాటాలని ఏపీ రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం బి.క్యాంప్ క్రీడా మైదానంలో ఆయన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే పురుషులు, మహిళల జట్లను ప్రకటించారు.

పురుషుల జట్టు...

చంద్రశేఖర్, సురేష్ నాయక్, బోగి నాయక్, నవీన్, బ్రహ్మయ్య, అప్పలరాజు, సోమేశ్వర్, రవిబాబు, ఉదయ్‌కిరణ్, వెంకటేష్, మల్లేష్

మహిళా జట్టు

రాజ్యలక్ష్మి, స్వామిని, జానకి, సత్య కళ్యాణి, మానస, నందిని. ఈ పోటీలకు కోచ్‌గా సుమంత్, మేనేజర్‌గా వెన్నెల వ్యవహరిస్తున్నారు.

క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (రూరల్): డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం అలిపిరిలో ఈనెల 13 నుంచి 16 వరకు జరుగుతున్న శిక్షణ శిబిరానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రమేష్ (కర్నూలు), లలిత, ఆదిత్య (తిరుపతి), గుప్త (కర్నూలు) క్రీడాకారులు ఎంపికైనట్లు ఏపీ డ్రాగన్ బోట్ అండ్ ట్రెడీషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. శిక్షణకు ఎంపికైన క్రీడాకారులను శనివారం క్రీడా మైదానంలో అభినందించారు. కార్యక్రమంలో అవినాష్, చిన్నసుంకన్న, జైపాల్, నాగరాజు, చంద్రశేఖర్, కాశీరావు, యూసుఫ్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమం విస్తృతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. శనివారం డీఎంహెచ్ఓ తన చాంబర్‌లో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో 17 బృందాలచే స్క్రీనింగ్ జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి, వారి సమ్మతం మేరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. సమావేశంలో డీపీఎం డాక్టర్ భరత్, డాక్టర్ రాజేశ్వరి, పీఎంఓలు మహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ

నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మెడికవర్, గాయత్రి, రమేష్, అమీలియో ఆసుపత్రులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగీ, క్షయ, మ్యూకార్ మైకోసిస్, హ్యూమన్ రేబీస్, టైఫాయిడ్‌తో పాటు అంటు వ్యాధులతో చికిత్స కోసం వచ్చిన వారి వివరాలను ఐహెచ్ఐపీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయా ఆసుపత్రుల నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణదానం చేయండి

అత్యవసర పరిస్థితుల్లో రోగికి కార్డియో పల్మనరీ రేససిటేషన్(సీపీఆర్) చేసి ప్రాణదానం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. డీఎంహెచ్ఓ వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా క్షేత్రస్థాయిలో రోగులకు మంచి వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రుక్మిణి, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, నోడల్ అధికారి ఐజాల్ హక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక 3వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నమార్కెట్, గని గల్లి, మొగల్‌పుర వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానులకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేశారు. నాలుగేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, సుందరీకరణ పనులకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని నిధులు తమ ప్రభుత్వం ఇస్తుందన్నారు. దీంతో ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్, పార్టీ నాయకులు ఖాదర్ బాషా, ఖుద్దూస్, చాంద్ బాషా, ముజహీద్, గౌసియా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సు అవసరం లేదు

ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, ఇందుకు ఎవరి సిఫార్సు అవసరం లేదని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి సమస్యలు తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఎమ్మెల్యేను కలిసిన ఏసీ

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాంబొట్ల దేవాలయం వద్ద కల్యాణమండపం నిర్మాణం, దేవదాయ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.


వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గిద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని ఉత్పాదకత పెంచే మెళకువలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. శనివారం వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన దేశి డిప్లొమ కోర్సుపై నిర్వహించిన అవగాహన సదస్సులో డీఆర్‌సీ డీడీఏ మాట్లాడుతూ.. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్ల దగ్గరకే వస్తుంటారని వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని సూచించారు. డిప్లొమ కోర్సు ద్వారా నేర్చుకున్న వాటిపై రైతులకు అవగాహన కల్పించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన కేంద్రం

కర్నూలు (రూరల్) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధర విషయంలో రైతులను దగా చేసిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి ఆరోపించారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 7న ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపు చర్యగా ఉందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి హనుమంతు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వనజ, వెంకటేశ్వర్లు, మధు, సిద్దయ్య గౌడ్, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

25 వాహనాలు సీజ్



పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో 25 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వాహనాలను సీజ్ చేసి కొత్తపేట దగ్గరున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనర్ల తల్లిదండ్రులను సాయంత్రం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపటం ప్రమాదకరమని డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. 25 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.50,875 జరిమానా విధించారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు అప్పగించమని వారి తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

క్రైం కార్నర్

బీడీ బంకులో చోరీ

కర్నూలు: స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్ ఆర్చి వద్ద ఉన్న బీడీ బంకులో దొంగలు పడి అందినకాడికి మూటగట్టుకుని ఉడాయించారు. బంకు నిర్వాహకుడు వెంకటేష్ శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని బంకుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.2 వేల నగదు, రూ.2 వేలు విలువ చేసే సరుకులు మూటగట్టుకుని వెళ్లారు. శనివారం ఉదయం వెంకటేష్ వచ్చి చూసేసరికి తాళాలు తెరిచి ఉన్నాయి. బంకులో ఉన్న సరుకులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు రోజులుగా బీడీ బంకులే లక్ష్యంగా చోరీలు చోటు చేసుకుంటున్నాయి. పాత సిరి నోబుల్ ఆసుపత్రి పక్కన ఉన్న బీడీ బంకు, మారెమ్మ దేవాలయం పక్కనున్న టీ హోటల్‌లో గ్యాస్ సిలిండర్, అశోక్ నగర్‌లోని మరో బీడీ బంకులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వరుస చోరీలతో చిరు వ్యాపారులు హడలెత్తిపోతున్నారు. వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు ముక్తార్, శేషన్న తదితరులు నేరస్థలాన్ని పరిశీలించి బంకు నిర్వాహకుడు వెంకటేష్‌ను విచారించారు.

పోలీసుల అదుపులో మహిళా దొంగలు

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు, వారి సహాయకుల నుంచి డబ్బు, సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న ఇద్దరు మహిళా దొంగలను శనివారం ఆసుపత్రి సెక్యూరిటీసిబ్బంది పట్టుకున్నారు. వారిని ఆసుపత్రిలోని అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించడంతో అనంతరం వారిని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాధాకృష్ణ టాకీస్ వీధికి చెందినట్లుగా చెబుతున్న రజియాతో పాటు ఆమె సోదరి ఇద్దరూ కలిసి ఆసుపత్రిలో ఉదయం నుంచి కలియదిరుగుతూ రోగులు, వారి సహాయకుల నుంచి సెల్‌ఫోన్లు, పర్సులు దొంగిలిస్తున్నారు. క్యాజువాలిటీ వద్ద ఓ మహిళ వద్ద పర్సును దొంగలిస్తుండగా అనుమానంతో ఆమె పట్టుకుని సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించారు. ఆమె బ్యాగ్‌లో రెండు బ్లేడ్లు, కొద్దిగా డబ్బు, మూడు సెల్‌ఫోన్లు లభించాయి.

తల్లితో గొడవ పడి కుమారుడు అదృశ్యం

కర్నూలు : మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన మహేష్ బాబు (18) తల్లి లక్ష్మీదేవితో గొడవ పడి ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఒక కూతురు, కొడుకు సంతానం. కుమారుడు మహేష్ బాబు భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ఆంజనేయులు కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో మహేష్ బాబు, చెల్లెలు కలసి తల్లి దగ్గరే ఉంటున్నారు. మే 17వ తేదీన ఇంట్లో తల్లితో గొడవ పడి వెళ్లిపోయాడు. అతడి కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా కనిపించకపోవడంతో తల్లి కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇక స్మార్ట్ స్ట్రీట్‌గా 'బిర్లా గడ్డ టు గాయత్రీ ఎస్టేట్

- అభివృద్ధి పనులకు నగరపాలక చర్యలు
- బిర్లా గడ్డ వద్ద రూ.40 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం
- ఆమోదించిన పాలక వర్గం

కర్నూలు (టౌన్) : పక్క చిత్రంలో అధ్వానంగా కనిపిస్తున్న ప్రాంతం బిర్లా గడ్డ వద్దనున్న రిలయన్స్ స్టోర్ సమీపంలో ఉంది. వర్షం కాలం వచ్చిందంటే చాలు ఇక్కడ రోడ్డుపై నిలిచిపోయి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు అంతా రోడ్డుపైకే చేరుతుంది. ఈ సమస్య పరిష్కారానికి డ్రైనేజీతో పాటు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. బిర్లాగడ్డ నుంచి గాయత్రీ ఎస్టేట్ వరకు ఈపనులు చేపట్టి స్మార్ట్ స్ట్రీట్‌గా తీర్చిదిద్దనున్నారు. ఈ పనులకు ఇటీవలే నగరపాలక కౌన్సిల్ సైతం ఆమోదం తెలపడంతో త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి.

నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి వార్డులో అభివృద్ధి ముమ్మరం చేసింది. ఇక కొన్ని ప్రాంతాలను స్మార్ట్ స్ట్రీట్‌గా గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.ఇందులో భాగంగానే బిర్లాగడ్డ నుంచి గాయత్రీ ఎస్టేట్ వరకు స్మార్ట్ స్ట్రీట్ రోడ్డుగా తీర్చిదిద్దేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మార్గంలో మురుగు కాల్వల నిర్మాణానికి రూ. 40 లక్షలు కేటాయించినట్లు నగరపాలక అధికారులు తెలిపారు.



రిలయన్స్ స్టోర్ సమీపంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి